

ఇద్దరు ఆత్మహత్య
జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోంపేట, కోటబొమ్మాళిలో ఘటనలు జరిగాయి. - 8లో



చిన్నబోయిన సన్నాలు
సన్నరకం బియ్యానికి మద్దతు ధర కరువైంది. దళారులు దోచుకుంటున్నారు. - 8లో



బైక్ నుంచి మంటలు
కాశీబుగ్గ: మొగిలిపాడు జాతీయ రహదారి వంతెన కింద సోమవారం బైక్‌కు మంటలు అంటుకున్నాయి. గిరిజన గ్రామానికి ఓ యువకుడు బైక్‌పై వెళ్తుండగా మంటలు అంటుకున్నాయి.

న్యూస్‌రీల్

ప్రార్థనా మందిరాల వద్ద పటిష్ట భద్రత


ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద వ్యక్తిగత కక్షలతో అన్యమత రాతలు రాసి ప్రశాంత సిక్కోలులో మత విద్వేషాలను రెచ్చగొడితే ఊరుకునేది లేదని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి హెచ్చరించారు. ఆయన ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 3600కు పైగా చర్చిలు ఉన్నాయని, మసీదులు 300కు పైగా ఉన్నాయని, ఇక దేవాలయాలైతే సంఖ్య మరింత ఎక్కువని ఇకపై ప్రతీ ప్రార్థనా మందిరం వద్ద భద్రతా పర్యవేక్షణ నిమిత్తం సీసీ కెమెరాలు తప్పనిసరిగా సంబంధిత కమిటీలు పెట్టుకోవాలని స్పష్టం చేశారు. మత విద్వేషాలు రేకెత్తించే ఉద్దేశంతో ప్రజలు, మతాల మనోభావాలు దెబ్బతినేలా సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెడితే కేసులు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరు పరుస్తామన్నారు. ప్రార్థనా మందిరాల నలువైపులా సీసీ కెమెరాలుండాలని, రాత్రిపూట సెక్యూరిటీ గార్డులుండాలని, తగినంత లైటింగ్ సిస్టం ఉండాలని సూచించారు. హుండీలకు భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసి కమిటీ సభ్యులు పర్యవేక్షించాలని, గ్రామాల్లో, పట్టణాల్లో కొత్త వ్యక్తులు (అనుమానిత) తారసపడితే సమీప స్టేషన్‌కు సమాచారమివ్వాలని సూచించారు. మత ఘర్షణలకు ప్రేరేపించే అపోహలు, వదంతులను నమ్మి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు.

సమగ్ర శిక్షా పీటీఐల నూతన జిల్లా కమిటీ ఎన్నిక


అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, రమేష్‌లను సత్కరిస్తున్న పీఈటీ సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు పరిధిలో పాఠశాలల్లో పనిచేస్తున్న 'పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ల' సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. శ్రీకాకుళం నగరం గుజరాతీపేటలో ఉన్న ఏవీఎస్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా చిగిలిపెల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బుడుమూరు రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగిలిన బాడీని త్వరలో ఎన్నుకోనున్నట్టు వారు చెప్పారు. ఎన్నికల నిర్వహణ అధికారులుగా జిల్లా పీడీ-పీఈటీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి హాజరయ్యారు. యూనియన్ బలోపేతానికి, ప్రభుత్వంతో జరపాల్సిన సంప్రదింపులు, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. త్వరలో సీఎంను, విద్యాశాఖమంత్రిని, విద్యాశాఖ, సమగ్రశిక్ష రాష్ట్రస్థాయి అధికారులను కలవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వపు ముఖ్య ప్రతినిధులు వై.సత్యనారాయణ, ఎల్.ఢిల్లీశ్వరరావు, జి.కామేష్, తారకేశ్వరరావు, సీహెచ్ దుర్గాప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. నూతన అధ్యక్ష,కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలిపారు.

హెచ్‌ఎంల పదోన్నతులకు రంగం సిద్ధం

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్యాశాఖలో పదోన్నతులకు రంగం సిద్ధమవుతోంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుల పోస్టులను అర్హులైన స్కూల్ అసిస్టెంట్లతో పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేటగిరీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాలను సిద్ధం చేశారు. వీటిని సంబంధిత వెబ్‌సైట్లలో ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంచారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం సవరణలు చేసి తుది సీనియారిటీ జాబితాను రెడీ చేయనున్నారు.

జెడ్పీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్స్ ఇలా..
జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేటగిరీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాను డీఈఓ శ్రీకాకుళం.ఓఆర్జీ వెబ్‌పోర్టల్‌లో ఉంచారు. వీటి అభ్యంతరాలను ఈనెల 19వ తేదీలోగా తగిన ఆధారాలతో డీఈ ఓ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది.

ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లో ఇలా..
ప్రభుత్వ (గవర్నమెంట్ స్కూల్స్) యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల నుంచి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గ్రేడ్-2 పదోన్నతి కోసం తాత్కాలిక సీనియారిటీ జాబితాను పాఠశాల విద్య ఆర్జేడీ జోన్-1 విశాఖపట్నం బి.విజయ భాస్కర్ వెల్లడించారు. ఆర్జేడీఎస్ఈవీఎస్‌పీ.కామ్ వెబ్‌సైట్‌లో ఉన్న ప్రమోషన్స్, సీనియారిటీ లిస్టుల జాబితాను చూడాలన్నారు. వీటిపై అభ్యంతరాలను ఈనెల 19వ తేదీలోగా పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోపల విశాఖపట్నం జోన్-1 ఆర్జేడీ కార్యాలయంలో సమర్పించవచ్చు. ఆధారాలు తప్పనిసరిగా సమర్పించాలి.

అర్ధరాత్రి అలజడి

- ఆయుధాలతో గ్రామంలోకి అపరిచితులు
- 80 మంది వరకు వచ్చారంటున్న గ్రామస్తులు
- నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో రంగంలోకి పోలీసులు
- సంప్రదాయ వేట కోసం వచ్చామని చెప్పిన వ్యక్తులు..

ఉలిక్కిపడిన దవళపేట

జి.సిగడాం: సోమవారం అర్ధరాత్రి దవళపేట ఉలిక్కిపడింది. నాలుగు ఆటోలు.. 10 ద్విచక్రవాహనాలు.. బాంబులు, బరిసెలు.. కత్తులు ఇతర మారణాయుధాలు.. 80 మంది వరకు అపరిచితులు ఒక్కసారిగా గ్రామంలోకి దూసుకొచ్చారు. వీరిని గమనించిన గ్రామస్తులు గగుర్పాటుకు గురయ్యారు. ఎవరు వీరంతా.. ఏమిటీ ఇంత రాత్రి వేళ.. ఏం జరుగుతోందంటూ ఊరంతా రోడ్లపైకి వచ్చేశారు. గ్రామస్తులు వారిని ప్రశ్నిస్తే.. ఇటుకల పండగ నేపథ్యంలో వేట సాగించేందుకు వచ్చామని.. సమాధానమిచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. మరి బాంబులు.. కత్తులు దేనికని ప్రశ్నిస్తే.. పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో గ్రామస్తులు బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్, పేడాడ స్వాతినాయుడు, సత్తిరాజు, హనుమంతు రమణమూర్తి, వెంకటరావు తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని కొందరు నేరుగా ఎస్పీకి ఫోన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగం ప్రవేశం చేశారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు నాలుగు ఆటోలు, 10 ద్విచక్ర వాహనాలతో పాటు 80 మందిని జి.సిగడాం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి వాండ్రంగి వంతెన సమీపంలో వీళ్లు హల్‌చల్ చేస్తున్నట్లు గ్రామస్తులు దవళూరి వెంకటరమణ, రఘురాం, రామచంద్రరావు, రామ్మోహన్‌రావు తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే అంశంపై లావేరు ఎస్ఐ లక్ష్మణరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నిర్వహించే ఇటుకల పండగ నేపథ్యంలో వేట సాగించడం వీరి ఆనవాయితీ అని, అందులో భాగంగానే ఇక్కడకు వచ్చినట్టు మీడియాకు వివరించారు. పొంతన లేని సమాధానాలు.. గ్రామస్తుల ఇబ్బంది నేపథ్యంలో విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు తరలించామని పూర్తి స్థాయి వివరాలు సేకరించే పనిలో ఉన్నామని ఎస్ఐ చెప్పారు.


ఆటోలో తీసుకొచ్చిన ఆయుధాలు




పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు


గ్రామస్తుల సమక్షంలో విచారిస్తున్న లావేరు ఎస్ఐ లక్ష్మణరావు

ఎస్పీకి ఫిర్యాదు చేశా..
గ్రామంలో ఒక్కసారిగా గందరగోళం నేపథ్యంలో నేరుగా ఎస్పీ మహేశ్వరరెడ్డికి ఫోన్‌లో సమాచారం అందించా. అర్ధరాత్రి వేళ గ్రామం మొత్తం భయాందోళనలు నెలకొన్నాయి. పొంతన లేని సమాధానాలు.. మారణాయుధాలు కలిగి ఉండడం రాత్రి వేళ ఇంత మంది గ్రామంపైకి రావడం సరికాదు. పూర్తి స్థాయి విచారణ చేయాలి.
–పేడాడ శ్రీరామ్మూర్తి, న్యాయవాది, దవళపేట

ఆపద వేళ... పాత్రోచితంగా..



ఆయన వయసు 60 దాటింది. చేస్తున్న పనుల నుంచి విశ్రాంతి తీసుకుని, శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాల్సిన ప్రాయమిది. కానీ ఆయన ఈ వయసులో కొత్త ప్రవృత్తిని వెతుక్కున్నారు. ఎవరైనా పాము ఉందని ఫోన్ చేస్తే చాలు వచ్చి వాలిపోతున్నారు. పాములు పట్టడం ఆయన వృత్తేమీ కాదు. యూట్యూబ్ ద్వారా ఈ విద్యను నేర్చుకున్నానని ఆయనే గర్వంగా చెబుతారు. దాదాపు 600 పాములకు ప్రాణభిక్ష పెట్టిన నరసింగ్ మహాపాత్రో పేరు ఇప్పుడు ఉద్దానం ప్రాంతంలో మార్మోగుతోంది. జీవితం చూపించిన సెకెండ్ ఇన్నింగ్స్‌లో ఈ పాత్రను ఆయన పాత్రోచితంగా పోషిస్తున్నారు.

- 600 పాములను పట్టుకున్న నరసింగ్ మహాపాత్రో
- పాములను చంపవద్దంటూ ప్రచారం
- జీవావరణ పరిరక్షణే ధ్యేయం

సోంపేట:

కొర్లాం పంచాయతీ బ్రాహ్మణకొర్లాం గ్రామానికి చెందిన నరసింగ్ మహాపాత్రో పాములకు ప్రాణభిక్ష పెడుతున్నారు. ఊళ్లలోకి వచ్చేస్తున్న సర్పాలను పట్టుకుని వారి నుంచి స్థానికులను, స్థానికుల నుంచి వాటిని రక్షిస్తున్నారు. ఏకంగా రాచనాగులను కూడా పట్టుకుని అడవిలోకి విడిచిపెడుతున్నారు. పాములు జీవావరణానికి మేలు చేస్తాయని చిన్ననాటి నుంచి నమ్మే వ్యక్తి మహాపాత్రో. ఆయన కేవలం ఐదో తరగతి వరకే చదువుకున్నారు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగించారు. ప్రస్తుతం దుస్తుల వ్యాపారం చేస్తున్నారు. ఐదేళ్ల కిందట తన మొబైల్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన మురళి పాములు పట్టుకోవడం చూశారు. ఆ పని ఈయనకు తెగ నచ్చేసింది. ఆనాటి నుంచి పాములను పట్టుకుని రక్షించాలని మనసులో అనుకున్నారు. దీంతో యూట్యూబ్‌లోనే పాములు పట్టుకోవడం నేర్చుకున్నారు. యూట్యూబే తన గురువని ఆయన చెబుతుంటారు.


రాచనాగులను చాకచక్యంగా పట్టుకున్న నర్సింగ్ మహాపాత్రో


▲ మహాపాత్రో పట్టుకున్న తాచుపాము

పాముల పాత్ర కీలకం


రాచనాగును అడవిలో విడిచిపెడుతున్న మహాపాత్రో

జీవావరణ సమతుల్యత ఉండాలంటే భూమిపై ప్రతి జీవి మనుగడ సాగించాలి. పాములు హాని కలిగిస్తాయనే భావనతో చాలామంది పాములను చంపుతున్నారు. అయితే జీవావరణ వ్యవస్థలో పాముల పాత్ర కీలకం అని మహాపాత్రో అవగాహన కల్పిస్తున్నారు. పాములను రక్షించాల్సిన బాధ్యత ఒక్కరిపై ఉందని అంటున్నారు. పాములను రక్షించి, ఇతర సురక్షిత ప్రాంతాల్లో విడిచి పెట్టినప్పుడు ఎంతో సంతోషంగా అనిపిస్తుందని చెబుతున్నారు. వాటి కళ్లలో ఆనందాన్ని చూడవచ్చని, కొన్ని సార్లు పాములను చంపేశారనే మాట వినిపిస్తే బాధ పడాల్సి వస్తుందని అన్నారు. తన నంబర్ (6301399048)కు ఫోన్‌చేస్తే పాములను సురక్షితంగా అడవిలో విడిచిపెడతానని తెలిపారు. అలాగే పాముకాటుకు నాటు వైద్యాన్ని ఆశ్రయించకూడదని, ఆస్పత్రికి వెళ్లి మందులు తీసుకోవాలని గ్రామాల్లోనూ ఆయన అవగాహన కల్పిస్తున్నారు.


పాములు పట్టేందుకు మహాపాత్రో తయారు చేసుకున్న పనిముట్లు

సొంతంగా పనిముట్లు
పాములు పట్టడానికి ఉపయోగించే పరికరాలు ఆయనే సొంతంగా తయారు చేసుకున్నారు. వాటినే వినియోగించి సర్పాలు పట్టుకోవడంలో మంచి నేర్పరిగా మారారు. ఈ ఐదేళ్లలో దాదాపు 600 పాములు పట్టుకుని అడవిలోకి విడిచిపెట్టారు. తన సంకల్పం మంచిది కావడంతో దేవుని దయ వల్ల ఇప్పటి వరకు పాములు తనకు హాని తలబెట్టలేదని, తాను పాముకాటుకు గురి కాలేదని తెలియజేశారు. అరవై ఏళ్లు నిండాక ఈ వృత్తిలోకి ప్రవేశించిన నరసింగ్‌ను స్థానికులు అభినందిస్తున్నారు.

కూర్మో రక్షతి రక్షితః


ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెడుతున్న దృశ్యం

సముద్రంలో తాబేళ్లు ఉండడం మానవాళికి మంచిదని, మత్స్య సంపద పెరుగుదలకు ఇవి దోహదపడతాయని, అందుకే వాటిని రక్షించాలని బ్రాహ్మణతర్లా హైస్కూలు జాతీయ హరిత క్లబ్ క్లస్టర్ కో ఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు చెప్పారు. వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరులో గల అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని సోమవారం పలాస మండలం బ్రాహ్మణతర్లా విద్యార్థులు సందర్శించారు. ముందుగా విద్యార్థులు తీరంలోని వ్యర్థాలను ఏరి బీచ్‌ను శుభ్రం చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన హేచరీలలో పొదిగిన తాబేలు పిల్లలను సముద్రంలోని విడిచిపెట్టారు. కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు బీటీఓ టి.తిరుపతిరావు, ట్రీ ఫౌండేషన్ వలంటీర్ షేక్ ఖాసిం, ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రమణరావు, కొయ్యల శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు. –పలాస

అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుద్దాం


అంబేడ్కర్ విగ్రహం వద్ద మంత్రులతో దళిత సంఘ నాయకులు. చిత్రంలో కలెక్టర్, జేసీ తదితరులు

- అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఆర్ట్సుకాలేజీ కూడలిలో సోమవారం అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని.. కాంస్య విగ్రహావిష్కరణ చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ కళావేదిక వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ అంబేడ్కర్ చరిత్ర పిల్లలకు చెప్పాలన్నారు. కాంస్య విగ్రహం ఏర్పాటు చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆయన రాసిన రాజ్యాంగాన్ని 75 ఏళ్లుగా పూజిస్తున్నామని అన్నారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అందుకుని సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా ప్రతి ఒక్కరూ ఎదగాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ రాజ్యాంగం.. ప్రతి భారతీయుడికీ పవిత్ర గ్రంథమని తెలిపారు. ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థానాల్లో ఉన్నారంటే దానికి అంబేడ్కర్ కారణమన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘనంగా నివాళి
శ్రీకాకుళం రూరల్: రాజ్యాంగ రూపకర్త బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆయన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని తెలిపారు. ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

వ్యక్తిగత కక్షతోనే రాతలు

- ఆలయాలపై అన్యమత రాతల సూత్రధారి బుడితి పాస్టర్ జాన్ పీటర్
- తనకు పోటీగా మరో చర్చి రాకూడదని తెగింపు
- సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకున్న పోలీసులు


మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, వెనుక నిందితులు

శ్రీకాకుళం క్రైమ్ : తన ఆదాయం తగ్గిపోతుందేమో అన్న భయం, తన సహాయకుడిపై పెంచుకున్న కక్ష కలగలిపి ఓ పాస్టర్ ఆలయాల గోడలపై అన్యమత రాతలకు తెగబడ్డాడు. జలుమూరు మండలం యలమంచిలి, కొండపోలవలస, కామినాయుడుపేటల్లోని హిందూ దేవాలయాలపై అన్యమత రాతలు రాసిన వ్యక్తి సారవకోట మండలం బుడితి పాస్టర్ చంద్రక దేముడు నాయుడు అలియాస్ పీటర్ (39) అని పోలీసులు నిర్ధారించారు. అదే గ్రామానికి చెందిన పాగోటి ఈశ్వరరావు (34), కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన మామిడి అజయ్‌లు సహకరించినట్లు తేల్చారు. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తొమ్మిది పోలీసు బృందాలు సాంకేతిక ఆధారాల సాయంతో ఈ కేసును ఛేదించడం విశేషం. ఎస్పీ తెలిపిన వివరాల్లోకి వెళితే..

మార్చి 30న జలుమూరు మండలం యలమంచిలి గ్రామం ఎండల కామేశ్వరస్వామి గుడిలోపల అన్యమత రాతలు కనిపించాయి. దీంతో పాటు కామినాయుడుపేట, కొండపోలవలస గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల గోడలపై సైతం ఇలాంటి రాతలే కనిపించాయి. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సున్నిత అంశం కావడంతో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అడిషనల్ ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు, శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద, అప్పటి టెక్కలి డీఎస్పీ మూర్తిలను అలర్ట్ చేశారు. వెంటనే సీఐలు జె.శ్రీనివాసరావు (నరసన్నపేట), చింతాడ ప్రసాద్ (కొత్తూరు), ఎ.విజయ్‌కుమార్ (టెక్కలి), చంద్రమౌళి (సీసీఎస్), టి.శ్రీను (సైబర్‌సెల్)ల ఆధ్వర్యంలో తొమ్మిది పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి.

పథకాన్ని రచించారిలా..
కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసిన పోలీసులు పాస్టర్ పీటర్‌జాన్ ఈ పనికి పూనుకున్నట్లు గుర్తించారు. బుడితి చర్చిలో పాస్టర్‌గా పీటర్ జాన్ ఉన్న సమయంలోనే యలమంచిలికి చెందిన చొక్కాపు శంకరరావు సహాయకారిగా ఉండేవారు. గత రెండేళ్ల నుంచి బుడితి చర్చికి రాకుండా యలమంచిలి గ్రామంలోనే తాత్కాలిక చర్చిని ఏర్పాటు చేసి ప్రార్థనలు చేసుకుంటున్నారు. గ్రామంలోనే చర్చి నిర్మాణం కోసం పీఏ స్వామి అనే వ్యక్తి వద్ద 30 సెంట్ల స్థలం శంకరరావు కొనడంతో పీటర్‌జాన్ కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా యలమంచిలిలో చర్చి నిర్మాణం జరగకుండా ఆపాలని నిశ్చయించి తాను న్న చర్చిలో కీలక సభ్యుడైన పాగోటి ఈశ్వరరావు (ఆటోడ్రైవర్)తో కలిసి పథకం రచించాడు. ఈశ్వరరావు తన చిన్ననాటి మిత్రుడైన కాకినాడ జిల్లాకు చెందిన మామిడి అజయ్ (కంటైనర్ డ్రైవర్, మెకానిక్)ను జాన్ పీటర్ వద్దకు రప్పించాడు. చుట్టుపక్కల ఇతర దేవాలయాలపై అన్యమతరాతలు రాస్తే చొక్కాపు శంకరరావు మీద పడుతుందని, ప్రజలు దాన్ని నమ్మి శంకర్రావును తరిమేస్తారని, చర్చి నిర్మాణం కూడా ఆగిపోతుందని ముగ్గురూ కలిసి వ్యూహం రచించి ఈనెల 29న పక్కాగా అమలు చేశారు.

నిందితులను జలుమూరు పోలీసులు బుధవారం ఉదయం ఏడుగంటలకు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి స్ప్రే బాటిల్, బొలేరో వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

సాంకేతికత సాయంతో..
దర్యాప్తులోకి దిగిన పోలీసులు 65 సీసీ ఫుటేజీలు పరిశీలించారు. కాల్‌డేటా రికార్డులు, లొకేషన్లు, సిగ్నళ్లు, గూగుల్ టైమ్‌లైన్ వంటివన్నీ పరిశీలించి నిందితుల జాడ కనుగొన్నారు. గత నెల 29 రాత్రి 9:32 గంటలకు బుడితి చర్చి వద్దకు పాస్టర్ జాన్ పీటర్ రావడం, 9:41 గంటలకు ఇద్దరు యువకులు వచ్చి పాస్టర్‌ను కలవడం, ముగ్గురూ కలిసి 9:45 ప్రాంతంలో చర్చిలోపలకి వెళ్లడం, నీలం రంగు బొలేరో వాహనంలో ఇద్దరు యువకులు బయటకు రావడం జరిగింది. వాహనంలో ఉన్న ఓ యువకుడు బుడితి గ్రామానికి చెందిన ఈశ్వరరావుగా గుర్తించడంతో పోలీసుల పని సులువైంది. అతనికి తోడుగా వచ్చింది కాకినాడ జిల్లాకు చెందిన అజయ్‌గా గుర్తించారు. ఈ ఆలయాలన్నీ మూడు కిలోమీటర్లలోపే ఉన్నాయి.

ఇలా దొరికారు
అజయ్ కాల్ డేటా, టవర్ డైరెక్షన్, ఐపీడీఆర్, వాట్సాప్, సిగ్నల్‌యాప్, పాయింట్ లొకేషన్లన్నీ మిగతా ఇద్దరి నిందితులతో మ్యాచ్ అయ్యాయి. అంతేకాక అజయ్ ఇంటికి వెళ్లగా అక్కడ ఇంటి గోడలపై రాతలు, బైక్, స్ప్రే బాటిల్స్ అన్నీ కనిపించాయి. దీనికి తోడు ఈశ్వరరావుకు పర్సనల్ డైరీ రాసే అలవాటు ఉంది. నేరం జరిగిన 29న అజయ్‌ను కలిసినట్లు రాశాడు. మిగతావన్నీ మార్చి మార్చి రాసుండటంతో అనుమానాలు కలిగాయి. ఇక పాస్టర్ జాన్ పీటర్ ఒక్క 29వ తేదీ కాల్‌లాగ్ డిలీట్ చేయడం.. ప్రశ్నిస్తే తత్తరపాటుకు గురై నిజాన్ని ఒప్పుకోవడంతో దర్యాప్తు కొలిక్కి వచ్చింది.

క్లుప్తంగా

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక కోర్సులు

శ్రీకాకుళం రూరల్: ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులకు రాగోలు జెమ్స్ ఆస్పత్రి బొల్లినేని మెడిస్కిల్స్‌లో జీడీఏ, ఐసీయూ, ఓటీ అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బీఎస్సీ డిప్లమా పారామెడికల్ నర్సింగ్ బీపీటీ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మాజీ సైనికుల భవనానికి శంకుస్థాపన

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు పంచాయతీ రాయిపాడులో సైనిక్ భవన నిర్మాణానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం, కేంద్ర ప్రభుత్వం 50శాతం నిధులతో కలిపి రూ.2 కోట్ల 92 లక్షల నిధులతో ఈ భవనాన్ని నూతనంగా సైనిక్ భవన్‌గా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓ కె.సాయిప్రత్యూష, సైనిక్ సంక్షేమ సంచాలకులు వెంకటరెడ్డి, ప్రెసిడెంట్ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగించిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్: నగర పరిధిలోని డీసీసీబీ కాలనీలో భూసమేత వెంకటేశ్వర స్వామి ఆలయం, నర్సస్ కాలనీకి వెళ్లే రహదారి ఆక్రమణకు గురైన విషయం తెలిసిందే. ఆదివారం పలు ప్రజాసంఘాల ప్రతినిధులు నిరసన వ్యక్తం చేయడంతో ఎట్టకేలకు మున్సిపల్ యంత్రాంగం దిగొచ్చింది. అధికారులు సోమవారం ఉదయం జేసీబీతో వెళ్లి ఆక్రమణలు తొలగించారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకున్నారు.

శ్రీనివాస్‌కు సాహితీ లహరి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న చాడ శ్రీనివాస్

శ్రీకాకుళం కల్చరల్ : నగరానికి చెందిన ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు చాడ శ్రీనివాస్‌కు సాహితీ పురస్కారం దక్కింది. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని సూర్యాపీఠం సమావేశ మందిరంలో సాహితీ లహరి, మంచిపల్లి సేవా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ డి.వి.జి.శంకరరావు, పక్కి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బొలెరో ఢీకొని వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక మండపొలం కాలనీ సమీపంలో పాత జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చేరివీధికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు జి.సింహాద్రి సైకిల్‌పై మండపొలం కాలనీ నుంచి తన వీధి వైపు వెళ్తుండగా వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో సింహాద్రికి తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నబోయిన సన్నాలు

- మార్కెట్‌లో సన్నరకం ధాన్యానికి మద్దతు ధర కరువు
- పెరిగిన విస్తీర్ణంతో ఎగుమతులకు తగ్గిన డిమాండ్
- దళారుల చెప్పిన ధరకు అమ్ముకుంటున్న రైతులు



ధర లేక రైతుల గోదాంలో నిల్వ ఉన్న సాంబమసూరి ధాన్యం

మిల్లులో ప్యాకింగ్‌కు సిద్ధంగా వున్న సన్నబియ్యం

పోలాకి :

సన్నబియ్యం రకం ధాన్యం సాగు చేస్తున్న రైతులు చిన్నబోతున్నారు. సరైన మద్దతు ధర లేక దిగాలు చెందుతున్నారు. గత ఏడాదితో పోల్చితే ధరలు పతనం కావడంతో నష్టాలు చవిచూస్తున్నారు. గత్యంతరం లేక దళారులు చెప్పిన ధరకే ధాన్యం అమ్ముకుంటున్నారు.

డిమాండ్ ఉన్నా..

హోటల్ వంటకాలు, వివాహాది శుభ కార్యాలు, ఇతర ఫంక్షన్‌లలో ఎక్కువగా వినియోగించేది సన్న బియ్యమే. ఎగువ మధ్య తరగతి నుంచి ఆపైస్థాయి కుటుంబాల్లో వంటింట్లో ఉడికేది కూడా ఎక్కువగా సన్న బియ్యమే. దేవాలయాల్లో పులిహోరా, చక్కెరపొంగలి వంటి ప్రసాదం తయారీకి కూడా సన్నబియ్యమే వినియోగిస్తుంటారు. అలాంటి సన్న బియ్యం పండించే రైతులకు మాత్రం గిట్టుబాటు ధర లేక అవస్థలు తప్పడంలేదు. గతేడాది వరకు సన్నాలు (సన్నరకం ధాన్యం) పండించే రైతులకు అందుకు తగ్గ ప్రతిఫలంగానే ధరలు ఉండేవి. ముఖ్యంగా సాంబమసూరిగా పిలవబడే బీపీటీ-5204, ఎంటీయూ-1224, జేజేఎల్-1798, ఎస్‌ఎల్‌ఆర్-34449తోపాటు అంకూర్ సోనామ్, సూపర్ అమన్ వంటి పలు సూపర్‌ఫైన్ వరి రకాలకు మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉండేది. మద్దతు ధర కంటే ఎక్కువ ధర చేతికందేది. మార్కెట్‌లో సన్నబియ్యంకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో మరింతగా ధర పెరుగుతుందని ఆశించిన అన్నదాతకు మాత్రం ఈఏడాది నిరాశే మిగిలిందని చెప్పాలి. గతేడాది అత్యధికంగా రూ.2900 వరకు పలికిన సన్నబియ్యం క్వింటా ధర నేడు మద్దతు ధర రూ.2320 కంటే కిందికి దిగజారింది. 80 కిలోల బస్తా రూ.1650 నుంచి రూ.1700 మాత్రమే పలుకుతోంది. అదికూడా సాంబమసూరి(బీపీటీ-5204) రకం మాత్రమే మిల్లింగ్‌కు బాగుంటుందని వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల రబీలో పండించిన ఆర్‌ఎన్‌ఆర్ రకం సన్నాలు(సుగర్‌లెస్) పంట చేతికొచ్చిన నేపథ్యంలో మిగిలిన సన్నరకాలను కొనే వారే కరువయ్యారు.

	సంవత్సరం	మద్దతు ధర
క్వింటా ధర	2023-24	రూ.2600-రూ.2800
క్వింటా ధర	2024-25	రూ.2100-రూ.2250

ఎందుకు తగ్గిందో..

సన్నాలు పండించే రైతుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం దృష్టిసారించాలి. ఎఫ్‌సీ వెరైటీలు(దుడ్డు, మధ్యస్థ రకాలు) కంటే తక్కువ దిగుబడి వచ్చినా మద్దతు ధర కంటే ఎక్కువ ఉంటుందనే కారణంతోనే సన్నాలు పండించాం. సన్నబియ్యానికి డిమాండ్ ఉన్నా ధాన్యానికి ధర లేకపోవటం ఏంటో అర్థం కావటంలేదు.

– సీపాన రామారావు, రైతు, రేగుపాడు

డిమాండ్ బట్టే ధర..

సన్నరకం ధాన్యం ఉత్పత్తి పెరగటంతో డిమాండ్ తగ్గింది. అందులోనూ కొన్ని వెరైటీలు పాట్ల తెలుపు రావటంతో ఎగుమతులకు పనికిరావటం లేదు. బీపీటీ-5204(సాంబ రకం) మిల్లింగ్‌కు బాగుంటుంది. ప్రస్తుతం రబీలో పండించిన సన్నాలు సైతం అందుబాటులోకి వచ్చాయి. దీంతో డిమాండ్ మరింతగా తగ్గింది.

-పి.రవి, రైస్ ఎక్స్‌పోర్ట్ ఏజెంట్

వంట బిల్లులు వెంటనే చెల్లించాలి



లావేరులో నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు, వంట కార్మికులు

ఎచ్చెర్ల : మధ్యాహ్న భోజనం పథకం వంట కార్మికులకు పది వేల రూపాయల వేతనం, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఏపీ మధ్యాహ్నభోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర డిమాండ్‌చేశారు. మండల కేంద్రం లావేరులో సోమవారం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ముందుగా స్కూల్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు రూ.3 వేల జీతంతో నెట్టుకొస్తున్నారని చెప్పారు. నిత్యావసర వస్తువులు, గ్యాస్ ధరలు పెరుగుతున్నా వేతనాలు, మెనూ చార్జీలు మాత్రం పెరగడం లేదన్నారు. ప్రాథమిక విద్యార్థులకు రూ.6.12 పైసలు, హైస్కూల్ విద్యార్థులకు రూ.9.29 పైసలతో నాణ్యమైన పౌష్టికాహారం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఒక్కో విద్యార్థికి మెనూ చార్జీ రూ.20కు పెంచాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, మౌలిక సదుపాయాలని కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ధనలక్ష్మి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆశావర్కర్ల వేతనాలు పెంచాలని, ఒప్పంద జీవోలు అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ధనలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఏర్పడి 20 ఏళ్లయిన సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో 'ఆశా వర్కర్లు సాధించిన విజయాలు -సవాళ్లు' అనే అంశంపై సదస్సు జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, పోస్టులను రెగ్యులర్ చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు ఆరోగ్య సేవలందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశా కార్యకర్తలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులతో పలాస, సంతబొమ్మాళిలో ఆశా కార్యకర్తల తొలగింపులను జిల్లాలో అడ్డుకోవడం జరిగిందన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉన్న 44 లేబర్ కోడ్లను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్పు తీసుకురావడం కార్మికుల మెడకు ఉరితాడువంటిదన్నారు. మే 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో కార్మిక వర్గం యావత్తు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, ప్రధాన కార్యదర్శి జి.అమరావతి, నాయకులు పి.జయలక్ష్మి, లావణ్య, రాకోటి సుజాత, పార్వతి, సుధ, స్వర్ణలతా పట్నాయక్, అన్నపూర్ణ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం



పానకం పంచుతున్న కమిటీ సభ్యులు

కాశీబుగ్గ : ఒడియా నూతన సంవత్సరం సందర్భంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జగన్నాథ మందిరం వద్ద సోమవారం ప్రత్యేక హోమం నిర్వహించారు. జై జగన్నాథ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఒడియా ఆచార సంప్రదాయం ప్రకారం మేష సంక్రాంతి నుంచి నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ప్రజలకు పానకం పంచారు. కార్యక్రమంలో జగన్నాథ ఆలయ కమిటీ సభ్యులు, ఒడియా బ్రాహ్మణ కుటుంబాలు పాల్గొన్నాయి.

షైన్ అవార్డులకు సిక్కోలు విద్యార్థులు


దామోదర స్వప్న


ఎ.సేవేంద్రకుమార్


కర్ని ధరణి

శ్రీకాకుళం న్యూకాలనీ : సిక్కోలు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అదరహో అనిపించి స్టేట్ అవార్డులకు ఎంపిక య్యారు. వివిధ ప్రభుత్వ యాజమాన్య విద్యాసంస్థల్లో చదువుతూ టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు షైన్ అవార్డులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపికచేసింది. శ్రీకాకుళం జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. టాపర్లను ఈ నెల 14, 15 తేదీల్లో విజయవాడ/గుంటూరులో సత్కరించేలా ఏర్పాట్లు చేసింది. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని దామోదర స్వప్న ఎంపీహెచ్‌డబ్ల్యూ ఒకేషనల్ కోర్సులో 1000 మార్కులకు 989 మార్కులతో రాష్ట్రంలో టాపర్‌గా నిలిచింది. ప్రిన్సిపాల్ బి.శ్యామ్‌సుందర్, అధ్యాపకులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రాణించింది. శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థిని ఎ.సేవేంద్రకుమార్ సీజీఏ ఒకేషనల్ కోర్సులో 1000 మార్కులకు 958 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ప్రిన్సిపాల్ పి.దుర్గారావు, అధ్యాపకులతో నిరంతరం ప్రోత్సాహంతో రాణించింది. బూర్జ మండలం ఓవీ పేట మోడల్ స్కూల్ విద్యార్థిని కర్ని ధరణి ఎంపీసీ జనరల్ కోర్సులో 1000 మార్కులకు 984 మార్కులు సాధించి శభాష్ అనిపించింది. ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, తల్లిదండ్రులు, పీజీటీల ప్రేరణ మరువలేనిదని చెబుతోంది.

ఎక్సైజ్ హెచ్‌సీ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమణ

శ్రీకాకుళం క్రైమ్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు (ప్రెసిడెంట్)గా జిల్లాకు చెందిన జి.వి.రమణ నియమితులయ్యారు. సోమవారం గుంటూరులో పీఅండ్‌ఈఐ ఆధ్వర్యంలో అసోసియేషన్ ఎన్నికల్లో ఈయన్ను ఎన్నుకున్నారు. రమణను శ్రీకాకుళం ఈఎస్ కార్యాలయంలో హెచ్‌సీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

16, 17 తేదీల్లో డైట్ పోస్టులకు పరీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని వమ్మరవల్లి డైట్ శిక్షణా సంస్థలో ఖాళీగా ఉన్న 5 సీనియర్ లెక్చరర్, 17 లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఈ నెల 16, 17 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య సోమవారం పేర్కొన్నారు. ఫారెన్ సర్వీస్‌పై డిప్యుటేషన్ విధానంలో పనిచేసే ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత కలిగిన వారి జాబితాను, స్లాట్‌లను 'డీఈఓశ్రీకాకుళం.ఓఆర్జీ' వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు తెలిపారు. నిర్దేశిత సమయానికి గంటే ముందే చేరుకోవాలని, పరీక్షకు సంబంధించిన ట్యాబ్‌లను పాఠశాల విద్యాశాఖే అందజేస్తుందని డీఈఓ పేర్కొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



రణస్థలంలో ఫైర్ స్టేషన్ వద్ద సోమవారం అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 20 వరకు వారోత్సవాలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహన్‌రావు, రణస్థలం అగ్నిమాపక అధికారి పైల అశోక్, జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

-రణస్థలం

ఐక్యంగా పోరాడితేనే బీసీలకు రాజ్యాధికారం



ఐక్య నినాదం చేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘ నాయకులు

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా బీసీలు బతుకులు అగ్రకుల పెత్తందారుల కబంధహస్తాల మధ్యనే నలిగిపోతున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు అన్నారు. బీసీలు రాజ్యాధికారం సాధించే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. ఏ ఉద్యమానికైనా శ్రీకాకుళం జిల్లా నుంచే శ్రీకారం చుడితేనే విజయవంతమవుతుందన్నారు. శ్రీకాకుళం నగరంలో బీసీ నాయకులతో కలిసి ఓ ప్రయివేటు భవనంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ బీసీ వ్యక్తి ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే రూ.25 నుంచి రూ.100 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కుటుంబ రాజకీయాలకు స్వస్తి చెప్పి బీసీలకు న్యాయం చేసే పాలకుల్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఐక్యతగా ఉంటేనే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందని, లేకుంటే జీవితకాలం అగ్రకులాల చేతుల్లో కీలుబొమ్మల్లా ఉండిపోవాల్సి వస్తుందన్నారు. త్వరలో విజయవాడలో బీసీలందరితో కలిసి సభ ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘ నాయకులు కిల్లాన శ్రీనివాసరావు, ఆవు నరసింహరావు, ఎంఏ బేగ్, గద్దిబోయిన కృష్ణ యాదవ్, నర్తు నరేంద్రయాదవ్, బి.రాజేష్, బాదాన దేవభూషణ్, గురునాథ్‌యాదవ్, కిల్లాన మాధవరావు, కిల్లాన దిలీప్, నాగేశ్వరరావు, లక్ష్మి, పి.రామకృష్ణ, కలగ కేశవరావు, శాలిన లక్ష్మణరావు, అలపాన త్రినాథరెడ్డి, వాన కృష్ణచంద్, ఆగూరు ఉమామహేశ్వరరావు, బి.సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయమే లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: సామాజిక న్యాయమే లక్ష్యంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ముందుకు సాగారని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఐసీఎస్ఎస్ఆర్ (ఎస్ఆర్‌సీ) హానరీ ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సోమవారం 'విస్మరించబడిన వర్గాలకు సాధికారిత' అనే అంశంపై రెండు రోజుల సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ మార్గం అనుసరణీయమన్నారు. ప్రపంచ మేధావుల్లో అంబేడ్కర్ అగ్రస్థానంలో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో వీసీ రజిని, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఆగూరు



నియామక పత్రం అందుకుంటున్న ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జాతీయ బీసీ సంక్షేమ సంఘం లీగల్ సెల్ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది, ప్రస్తుత జిల్లా బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావును నియమించారు. ఈ మేరకు సోమవారం జిల్లాకు వచ్చిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లాగా వెంగళరావు ఓ ప్రయివేటు భవనంలో బీసీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమామహేశ్వరరావుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈయన నియామకం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్టా దామోదర్‌రావు, కార్యవర్గ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం న్యాయవాదుల విభాగం జిల్లా అధ్యక్షుడు వాన కృష్ణచంద్, న్యాయవాదులు మామిడి క్రాంతి, బీసీ సంఘం నేత భద్రి సీతమ్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

క్రైమ్ కార్నర్


ఆటోడ్రైవర్ ఆత్మహత్య



జి.ధర్మారావు(ఫైల్)

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ జి.ధర్మారావు (42)సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారావు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజులుగా కుటుంబ సభ్యులతో గొడవపడుతున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద గొడవ పడి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం పట్టణంలోని గొల్లవాని చెరువు సమీపంలోని తోటలో ఆటో తాడుతో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో భార్య మోహిని, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ లవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు వాసుదేవరావు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి స్టేట్ బ్యాంకు వెనుక ప్రకాష్ నగర్ కాలనీ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని పలాస మండలం బ్రాహ్మణతర్ల గ్రామానికి చెందిన కోరాడ వాసుదేవరావు(58) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుమారుడు పవన్‌కు సమాచారం అందించారు. వాసుదేవరావు ప్రకాష్‌నగర్‌లోనే ఉంటూ చిన్న చిన్న వంటపనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోటబొమ్మాళి ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి



గడ్డయ్య మృతదేహం

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరుకు చెందిన అరి గడ్డయ్య(55) స్థానిక తమ్మన్న కోనేరు (ముగతివాని చెరువు)లో మునిగి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ నెల 13న బహిర్భూమికని ఇంటి వద్ద చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. సోమవారం చెరువు వైపు వెళ్లిన వారికి గడ్డయ్య మృతదేహం తేలుతూ కనిపించడంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చెరువులో దిగిన సమయంలో గడ్డయ్యకు ఫిట్స్ రావడంతో చెరువులో పడి మృతి చెందినట్లు భార్య రమణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఎండీ అమీర్ అలీ కేసు నమోదు చేశారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.